
క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం



పొదలకూరు : పట్టణంలోని శివాలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో మాలధారణ భక్తులకు అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో నిత్యాన్నదానం(భిక్ష) చేస్తున్నారు. దాతల సహకారంతో సేవా సమాజం వారు భక్తుల కోసం ప్రత్యేకంగా భిక్షను ఏర్పాటు చేస్తున్నారు. గత 15 రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతోందని, కార్తీక మాసం పూర్తయ్యే వరకు మధ్యాహ్నం భిక్షను స్వాములకు ఏర్పాటు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

డిజిటల్ లావాదేవీలపై దృష్టి



కోవూరు : కోవూరు పంచాయతీకి సంబంధించి ఇంటి, కుళాయి పన్నులను చెల్లించే ప్రజలు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. కోవూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొదటి డిజిటల్ పేమెంట్‌ను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు సంబంధించి ఇంటి, కుళాయి పన్నులతో పాటు ఇతర వాటిని డిజిటల్ లావాదేవీల ద్వారా చేపట్టాలని ఆదేశించి ఉందని, ఈ మేరకు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షయ బాధితులకు ప్రభుత్వం ఆసరా



క్షయ బాధితులకు ఫుడ్ బాస్కెట్ల పంపిణీ

కొడవలూరు : క్షయ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆసరాగా నిలుస్తోందని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీలో 17 మంది క్షయ బాధితులకు ఫుడ్ బాస్కెట్స్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంటీబీఎంబీవై(ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ యోజన) పథకం కింద క్షయ బాధితులకు రూ.500 విలువైన పప్పు దినుసులు, వంట నూనెలతో కూడిన ఫుడ్స్ బాస్కెట్స్‌ను కేంద్రం అందిస్తోందన్నారు. క్షయ లక్షణాలున్న వారు పీహెచ్‌సీలో సంప్రదిస్తే ఉచితంగానే వైద్యం అందించి నయం చేస్తారన్నారు. టీబీ రహిత రాష్ట్రంగా మారాలంటే ప్రతిఒక్కరూ ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌకచర్లలో చేపల చెరువు వేలం

విడవలూరు : మండలంలోని చౌకచర్ల గ్రామంలో చేపల చెరువు వేలంపాట గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ప్రతాప్ రూ.1.26 లక్షలకు చెరువును దక్కించుకున్నట్లు ఎఫ్‌డీ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ నాగరాజు, సర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.

నారాయణను ప్రజలెలా నమ్ముతారు..?

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ఆప్యాయంగా పలకరిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టీడీపీ నేతలు, కార్యకర్తలనే విశ్వసించకుండా తన విద్యాసంస్థల సిబ్బందిని ఎన్నికలకు తీసుకొచ్చిన నారాయణను ప్రజలు ఎందుకు నమ్ముతారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్లో గల పాములమాన్యం, తిరిసిపేట, గచ్చు కాలువ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పర్యటించారు. స్థానికుల సమస్యలను ఆరా తీసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని 39, 40వ డివిజన్లకు సంబంధించిన దాదాపు అన్ని పనులను పూర్తి చేశామని, బాద్‌షాపేటలో రూ.10 లక్షలకు సంబంధించిన చిన్న ప్యాచ్ వర్క్‌లు ఉన్నాయని చెప్పారు. గచ్చు కాలువను పునరుద్ధరించి, కనెక్టివిటీ రోడ్డును తీసుకొచ్చేలా అధికారులకు సూచించామని తెలిపారు. 49వ డివిజన్లో 133 కేవీ సబ్‌స్టేషన్, మరో ఎనిమిది 33 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనను చేపట్టనున్నామని వెల్లడించారు. రంగనాయకులపేట గేట్ వద్ద అండర్ పాస్ నిర్మాణానికి టెండర్లను త్వరలో పిలవనున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లో చేసిన అభివృద్ధి.. ప్రజలకు ఉపయోగపడే పనులపై బుక్‌లెట్లను ముద్రించి ప్రతి ఇంటికీ అందజేయనున్నామని వెల్లడించారు. తననే ప్రజలు కోరుకుంటున్నారంటూ నారాయణ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నాలుగో డివిజన్ మైపాడు గేట్ సెంటర్ వద్ద నిర్మిస్తున్న మైపాడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపనను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాఫర్‌సాహెబ్ కాలువ పొడుగునా వాకింగ్ ట్రాక్, పార్కు పనులకు సంబంధించిన శంకుస్థాపనను వచ్చే వారంలో చేపట్టనున్నామని తెలిపారు. మూడో డివిజన్లో రూ.రెండు కోట్లతో రోడ్లు, డ్రెయిన్ పనులను ప్రారంభించనున్నామని వెల్లడించారు. మైపాడు రోడ్డు విస్తరణ.. జాఫర్‌సాహెబ్ కాలువ రిటైనింగ్ వాల్ పనులను తానే చేశాననే భ్రమలో నారాయణ ఉన్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాకే ఈ పనులు జరిగాయని గుర్తుచేశారు. కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, సంక్రాంతి అశ్విని, ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో గురజాడ అప్పారావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రామయ్య పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న షఫీవుల్లా

నెల్లూరు (టౌన్): హక్కులను హరిస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి షఫీవుల్లా పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో పీఎస్‌యూ రెండో రాష్ట్ర మహాసభలను గురువారం నిర్వహించారు. అనంతరం 13 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సభ్యులు అయ్యన్న, సురేష్, నరేంద్ర, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్సీపీని ఆదరించాలి



నెల్లూరు రూరల్: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా, క్లస్టర్ ఇన్‌చార్జి వేలూరు మహేష్, ఆరిఫ్ కోరారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నగరంలోని 42వ డివిజన్లో గురువారం నిర్వహించారు. అనంతరం సచివాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమ వివరాలను తెలిపే బోర్డులను ఆవిష్కరించారు. నేతలు రఫీ, సందానీ, అలీ అహ్మద్, దస్తగిరి, ఖాసిం, చాంద్‌బాషా, గౌస్‌అహ్మద్, జాహిద్, రిజ్వాన్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్తీక లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధం





నగరంలోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న కార్తీక మాస లక్ష దీపోత్సవానికి సర్వం సిద్ధమైంది. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
– నెల్లూరు(బృందావనం)

ఫొటోలతో బెదిరింపులు

• నిందితుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నువ్వంటే నాకిష్టం.. పెళ్లి చేసుకుంటానంటూ ఓ చిన్నారితో ఫొటోలు, వీడియోలు తీసుకొని.. విషయాన్ని ఎవరికైనా చెప్తే ఫొటోలను అందరికీ పంపుతానని బెదిరించాడు. చివరికి చిన్నారి తండ్రికి పంపడంతో ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసును పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం నెల్లూరుకు మూడేళ్ల క్రితం వచ్చారు. సంతపేటలోని గుప్తా పార్కు వద్ద ఓ స్కూల్ బిల్డింగ్ నిర్మాణ పనులు చేస్తూ తన పెద్ద కుమార్తెతో కలిసి అక్కడే ఓ గదిలో ఉంటున్నారు. అతని వద్ద అశోక్‌తో పాటు కొందరు పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో రూ.రెండు లక్షల అడ్వాన్స్ తీసుకొని కొంతకాలం పనిచేసి ఎవరికీ చెప్పకుండా జమ్మలమడుగుకు అశోక్ వెళ్లిపోయారు. రూ.60 వేలను ఇవ్వాల్సి ఉండటంతో జమ్మలమడుగుకు యజమాని వెళ్లి నిలదీశారు. పది రోజుల్లో ఇస్తానని చెప్పడంతో తిరిగి నెల్లూరొచ్చారు. ఈ నేపథ్యంలో తన యజమాని కుమార్తెతో సన్నిహితంగా ఉన్న ఫొటోను అశోక్ ఈ నెల 24న పంపారు. డబ్బులు డిగితే ఫొటోలు, వీడియోలను అందరికీ పంపుతానని బెదిరించాడు. ఊహించని పరిణామంతో కంగుతిన్న తండ్రి తన కుమార్తెను నిలదీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

జాతీయ పోటీలకు జేబీఆర్ విద్యార్థి



సాత్విక్‌ను అభినందిస్తున్న ఎంఈఓ, పాఠశాల సిబ్బంది

కోవూరు : మండల కేంద్రంలోని జేబీఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎ.సాత్విక్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురం మండలం జోగిపేట గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్–17 ఆర్చరీ విభాగంలో సాత్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాలలో గురువారం సాత్విక్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం గర్వకారణమన్నారు. అనంతరం ఆర్చరీ కోచ్ భరద్వాజ్‌ను ఎంఈఓ రహీమ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు షరీఫ్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సునీల్ పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటిని అందించండి



మాట్లాడుతున్న పోర్టు ప్రతినిధులు

ముత్తుకూరు : అదాని కృష్ణపట్నం పోర్టు ద్వారా నిర్వహించే ఆర్వో ప్లాంట్ల ద్వారా స్థానికులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కార్పొరేట్ వ్యవహారాల హెడ్ వేణుగోపాల్ అన్నారు. ఆర్వో ప్లాంట్ల ఆపరేటర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పోర్టు పరిధిలోని సీఎస్సార్ విభాగంలో ఉన్న ఆరు ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రతిరోజూ 20 వేల మందికి తాగునీరు అందిస్తున్నారని తెలిపారు. సక్రమంగా సరఫరా చేసేందుకు నీటి వినియోగదారుల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఎటువంటి అవరోధాలు, విమర్శలకు తావులేకుండా తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఫైనాన్స్ హెడ్ శ్రీకాంత్, అడ్మిన్ హెడ్ గంగాసతీష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో 32.6 మి.మీ వర్షపాతం



మంగళంపాడు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు

వెంకటాచలం : మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట నిస్తున్నాయి. నిత్యం వర్షం పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా గురువారం మండలంలో 32.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో చెరువుల్లోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది.

మంత్రిని కలిసిన నేతలు



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణిని గోవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర గిరిజన సంఘాల జేఏసీ నేత పాలకీర్తి రవి ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. వీరంపల్లి సబ్‌స్టేషన్లో తొలగించిన షిఫ్ట్ ఆపరేటర్ భానుచందర్ విషయంలో పూర్తిస్థాయి విచారణ జరపాలని.. పొరపాటు చేశారని నిర్ధారణైతే స్థానిక గిరిజనుడికి షిఫ్ట్ ఆపరేటర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. కాగా ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఆర్చరీ క్రీడాకారులకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఇస్కాన్ సిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు అక్షయ్ మహదేవ్, అశ్విన్ మహదేవ్ అండర్ – 14 రికర్వ్ విభాగంలో స్వర్ణ.. కాంపౌండ్ విభాగంలో రజత పతకాన్ని సాధించడాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ చాట్ల రాజేష్, కోచ్ దివ్యాప్రకాష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ





నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో పుష్పాభిషేకం, పడి పూజను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉభయకర్తలుగా గడ్డం రత్నయ్య, సుజాత దంపతులు, భావన, మేఘన వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

జాబ్ మేళా రేపు



పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మెగా జాబ్‌మేళాను శనివారం నిర్వహించనున్నామని కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాణాప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కళాశాలలో గురువారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. జాబ్‌మేళాకు 12 ఐటీ, ఫార్మసీ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. గత నాలుగేళ్లలో పది, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు మేళాకు హాజరుకావొచ్చని తెలిపారు. పీజీ కళాశాల డీన్లు మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి భానుచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ కల్లూరు శ్రీనివాస్, కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ ప్రతినిధులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తరుణంలో సత్కరించారు. జేఏసీ నేతలు శ్రీనివాసులు, సురేష్, సుదర్శన్, శివయ్య, వెంకటయ్య, సుధీర్, బాలపున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



నాగేంద్రకుమార్

నెల్లూరు (టౌన్): నెల్లూరుకు చెందిన నాగేంద్రకుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఏన్ అనాలసిస్ ఆఫ్ థియోరిటికల్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ ఫెయిర్ వాల్యూ అకౌంటింగ్ ఇన్ ఇండియా అనే అంశంపై కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో రవీంద్రనాథ్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు.

పలువురికి పరామర్శ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లలో పలువుర్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సుభాషిణి కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. వెంకటేశ్వరపురం, పునరావాస కాలనీ ప్రాంతాల్లో అనారోగ్యంతో మృతి చెందిన పాల్, గఫూర్, విజయ్‌బాబు, చిక్కయ్య, వెంకటస్వామికి కుటుంబీకులను పరామర్శించారు. డివిజన్ల ఇన్‌చార్జి బాలశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సఫియా ముజీర్, దేవరకొండ సుజాత, కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

3న భగవద్గీత కంఠస్థ పోటీలు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో భగవద్గీత కంఠస్థ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగంపై పోటీలను నిర్వహించనున్నామని, వివరాలకు 78938 47709 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

‘ఆడుదాం.. ఆంధ్రా’ రిజిస్ట్రేషన్లు వేగవంతం

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ‘ఆడుదాం.. ఆంధ్రా’ టోర్నీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సచివాలయాలతో పాటు 1902, ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి చేయాలి

• డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్



సూచనలిస్తున్న డైట్ కళాశాల ప్రిన్సిపల్

కొడవలూరు : ప్రభుత్వ ప్రోత్సాహంతో పాఠశాలలను అభివృద్ధి చేయాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ సూచించారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడంతో పాటు మెరుగైన బోధన పద్ధతులు అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల నోట్స్‌లను ప్రతిరోజూ పరిశీలించాలని, తద్వారా విద్యార్థులు వెనుకబడకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట డైట్ కళాశాల అధ్యాపకులు బీఎస్.దాస్, కె.విజయచంద్ర, పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఉన్నారు.

‘వెంకటేశ్వర’లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్తంగా గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 176 మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, హెచ్‌డీఎఫ్‌సీ నెల్లూరు సిటీ హెడ్ వీరభద్రరావు, రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.